చించుచున్నది. ఈ కావ్యమే లేని దాని నున్నట్టు ఉన్నది లేనట్టు చెప్పుచున్నది. మనల నానందాబ్ధిని దేల్చుచున్నది. (ప్రపంచమును) మఱపించుచున్నది. ప్రపంచమును నిలిపించుచున్నది. అది యెల్ల నెట్లు? వస్తుప్రదర్శన మెట్లు నిర్మింపఁబడెనో అట్లె నిలిచెనా? తాత్కాలిక రస మెట్లింతవట్టు పోషింపఁబడుచున్నది? భావము కలఁక గనదా? ఆశయ మడుగంటు కన్నే? యనెడు సందియములు తోఁపకమానవు. అవ్యక్తానంద మేమి యని యనకపోరు. కాని కావ్యమున వస్తుప్రదర్శనము వర్ణనములవల్లను పదములవల్లను రసములు వృత్తాంతిశీర్షి కలవల్లను, భావములు విరామములవల్లను, ఆశయములు పద్యములయందలి మాధు గానలహరివలనను, అవ్యక్తానందము అవ్యక్తరహస్యమువలనను చిరంజీవులుగ నొనర్పఁబడి కవితోఁబోక పాఠకునితో రాక స్వయం నిర్ణయనూత్రమున నగ్రస్థాన మధిష్ఠించుచున్నవి.

ఆ ప్రదర్శన సమున్నత పందర్శనమున చూపఱు వెలఁగం దుచు వివిధదృక్పథముల వీక్షించుచున్నారు. అనుభవాదిదృక్పథమునఁ జూచి చూచి, ఉత్తమానుభవరసభావాశయములఁ గనుచున్నారు. అభిరుచిదృక్పథమునఁ జూచి ఉత్తమాభిరుచిని గ్రహించుచున్నారు. ప్రమాణదృక్పథమునఁ జూచి ఉత్తమజీవనము గడపుచున్నారు. ప్రదర్శనదృక్పథమునఁ జూచి ఉత్తమభావను బడయుచున్నారు. ఎల్లెడలను అవ్యక్తరహస్యతన్మయు లగుచు నవ్యక్తానందచిరంజీవు లగుచున్నారు.

సామాన్యులే యి ట్లగుచుండ సారస్వతాభిమాని మాట వేఱ చెప్ప నేల? అతఁడు దాని పుట్టుకను తన పుట్టువును చూచుకొను చున్నాఁడు. దాని గుణాగుణములఁ దన గుణాగుణములు పరిగణించు కొనుచున్నాఁడు. దాని జీవకళలఁ దనజీవకళలు వహించుచున్నాఁడు. దాని జీవనమున తన జీవనమును సాగించుచున్నాఁడు. వే యేల? అతనికి సారస్వతము జాతీయనిసర్గనిధినిక్షేపము గాదే? అతనికి సారస్వతము ఆకాశగంగాతరంగశీకరప్రశీతలము గాదే? అతనికి సారస్వతము మలయపవనమోహనసుకుమారము గాదే? దాని విలువ దానినిరంతరరుచి దాని మనోహారభావము అమూల్యము అఖాతము అనంతము.

# మాలలు

బ్రహ్మభట్ల పట్టాభిరామశర్మ గారు

కట్టను గుడ్డ లేక కలకాలము నుండుట కిల్లు లేక చే
పట్టెడుదాత లేక పలుపాటులనందిన గూడు లేక యే
పట్టు తిరంబు లేక నడిబాటల నేగుట కాజ్ఞ లేక యి
ట్టట్టుజరించు మాలలకు నక్కట యెయ్యది దిక్కు
[దైవమా.

ఉ. మాలలు మాలలా! భరత
మాతృగళస్థ చిరత్నరత్న సం
లాలితమాల లాంధ్రమహి
లాకచకల్పిత నవ్య మల్లికా
మాల లనార్య సంతతి వి
మాన శిరోగ్ర లసత్పతాకినీ
మాలలు గాని, పట్టి కసు
మాలపు మాలలు గారు కారిలన్. 2

చ. పొలములు దున్ని టాలగుమిఁ
బోషణ జేయుట మంచి దుక్కి యె
ద్దుల సమకూర్చుటల్, తరిని
తోరపువిత్తులు జల్లి పైరువం
టల నెగి పెంపుసేయుట హు
టాహుటి నూరిచి ధాన్యమెల్లగా
సులగ నొనర్చి జీవనము
సూపెడి మాలల నోలి నూరికిన్
వెలుపల నుండఁజేయుట వి
వేకమె? హైందవలోకధర్మమే? 3

సీ. కడుపులోఁ బసిబిడ్డ గదల కున్నను మంచి
చప్పిడి మాలఁడే సంతరించు
చూపుదోషము పాల పాప లందిన తోలు
జందెంబు మాలఁడే సంగ్రహించు
బాలగ్రహము పసి పాపలఁ బీడింప
దిగదుడ్పు మాలఁడే తెలిపి మాన్పు
ప్రాణమూడిన ప్రతి మానవునకును సం
స్కారము మాలఁడే సంఘటించు.
గీ. పుట్టుటాదిగ ప్రాణికి గిట్టువఱకు
మాలఁడే తోడునీడౌచు మేలుజూప
నూరిచివఱకు గెంటుట నుచితమొకో
పుణ్యాతములార హైందవ పురుషులార! 4